రెచ్చగొట్టే ప్రసంగాలను ఉపేక్షించం

- సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం
- రాత్రి 10 గంటల్లోపు ప్రచారాన్ని ముగించాలి
- 48 గంటల ముందు ర్యాలీలకు అనుమతి తీసుకోవాలి
- 52 మంది రౌడీషీటర్స్ బైండోవర్
- ముషీరాబాద్ పీఎస్ పరిధిలో 10 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు: ఇన్‌స్పెక్టర్ నిరంజన్



ముషీరాబాద్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ముషీరాబాద్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రచారం, పాదయాత్రలప్పుడు అనుసరించాల్సిన విధానం, ప్రసంగాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి విషయాలపై ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నిరంజన్ వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే తీసుకునే చర్యలను వివరించారు. రెచ్చగొట్టే ప్రసంగాలను సహించే ప్రశ్నే లేదని... నిబంధనల మేరకు చర్యలు కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

- రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎవరైనా తమ ఎన్నికల ప్రచారాన్ని ఉదయం 6 గంటలకు ప్రారంభించి రాత్రి 10 గంటలలోపు ముగించాలి.
- ఆయా రాజకీయ పార్టీల ప్రచారానికి సంబంధించి 48 గంటల ముందు సువిధ యాప్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఒకే ఏరియాలో రెండుమూడు పార్టీలు ప్రచారం నిర్వహించదలుచుకుంటే ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఇచ్చి మిగతా వారి దరఖాస్తులను తిరస్కరిస్తాము.
- ఎమర్జెన్సీలో అప్పటికప్పుడు నిర్ణయించినట్లు అయితే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే దరఖాస్తు పరిశీలిస్తాము.
- ప్రభుత్వ స్థలాలు, ప్రార్థన మందిరాలలో ప్రచారం చేయరాదు. దీంతో పాటు మైనర్లను కూడా ప్రచారానికి వాడుకోరాదు.
- ప్రచార వాహనాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.
- రూ. 50 వేలకు మించి డబ్బులు తీసుకువెళ్లరాదు. ఒక వేళ తీసుకెళ్లాల్సి వస్తే సరైన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది.
- అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్స్‌ను ఉపయోగించరాదు.
- అనుమతి తీసుకున్న రూట్‌లోనే ప్రచారం నిర్వహించాలి.
- ఇప్పటి వరకు ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ. 3.80 లక్షలను సీజ్ చేశాము.
- రెండు ఎక్సైజ్ కేసులను కూడా నమోదు చేశాం.
- ముషీరాబాద్, రాంనగర్ చౌరస్తాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు.
- రాంనగర్ మీ సేవా కేంద్రం వద్ద 24 గంటలు ఎస్ఎస్‌టీ టీమ్ పని చేస్తుంది.
- ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్‌లో పది సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయనున్నాం.
- బయట నుంచి టీఎస్ఎస్‌పీ, పారా మిలటరీ దళాలు బందోబస్తు నిమిత్తం రానున్నాయి.
- రోజూ లాడ్జీలు, మెట్రో, బస్టాండ్‌లలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నాం.
- ముషీరాబాద్ పీఎస్ పరిధిలో 24 మందికి ఆయుధ లైసెన్స్ ఉండగా వాటన్నిటిని డిపాజిట్ చేశాం.
- 52 మంది రౌడీషీటర్స్(18 మంది కమ్యూనల్ నిందితులు) కౌన్సిలింగ్ ఇస్తున్నాం. వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.
- రెస్టారెంట్లు, హోటల్స్ రాత్రి 12 గంటలలోపు, ఇతర వ్యాపార సముదాయాలు 10 గంటలలోపు మూసి వేయాలి.
- రాజకీయ నాయకులు మతపరమైన విషయాలపైన ఒకరిని మరొకరు కించపరిచే, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే కేసులు నమోదు చేస్తాం.

టీఎంహెచ్‌ఈయూ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో గురువారం తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్‌ఈయూ) కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్‌తో కలిసి యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవోలు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్ దాస్, టీఎంహెచ్‌ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షురాలు పద్మజ, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ సుజాత, ఏఐటీయూసీ అధ్యక్షుడు కమ్రుద్దీన్, ఫార్మసిస్టు ఉమాదేవి, కార్యాలయ సిబ్బంది అహ్మద్, మధు, షమీ, సంధ్య, వైరాలజీ ల్యాబ్ సిబ్బంది చారి, నవాజ్, నయూమ్, నాగలక్ష్మి, నర్సింగ్ రావు, నరసింహ, శ్రీకాంత్, హేమలత, లక్ష్మి, నళిని, అబ్బాస్, నజ్మా, రాఘవేందర్, శీతల్ పాల్, సౌమ్య, అఖిల్, సర్వేష్, అర్చన, ఉమా, మల్లేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావుకు అశ్రునయనాలతో వీడ్కోలు



శేషగిరి అంతిమయాత్రలో పాల్గొన్న స్థానికులు, పోలీసులు

చిక్కడపల్లి: గన్ మిస్‌ఫైర్ కావడంతో మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శేషగిరిరావుకు గురువారం అశ్రునయనాలతో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. భద్రాచలంలో బుధవారం ఉదయం కూంబింగ్ జరిపి తిరిగివస్తున్న సమయంలో గన్ మిస్‌ఫైర్ కావడంతో చిక్కడపల్లి బాపూనగర్‌కు చెందిన శేషగిరిరావు మరణించిన విషయం విదితమే. శేషగిరికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గురువారం శేషగిరి మృతదేహాన్ని బాపూనగర్‌కు తీసుకువచ్చారు. ఆయన మృతదేహాన్ని చూడగానే కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి. స్థానికులు, సీఆర్‌పీఎఫ్ అధికారులు, పోలీసులు శేషగిరిరావు మృతదేహానికి నివాళులర్పించారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ నాగరాజు, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, బీఆర్ఎస్ నేత జైసింహ, రాకేష్, ఎంపీ అశోక్‌కుమార్, కోళ్ల సుధాకర్, కాంగ్రెస్ నేత ప్రఫుల్‌రామిరెడ్డి, జగన్, గుడిసెల రాజేష్ తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు, బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో శేషగిరిరావు భౌతికకాయానికి పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియాలు నిర్వహించారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు: సుద్దాల అశోక్‌తేజ



మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఉంటుందని, భావితరాలకు ఉపాధ్యాయులే రూపకర్తలని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో టీచర్స్‌కు వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ... విద్యార్థులు ఒక చదువులోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని అందుకు నిరంతరం అధ్యాయనం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విద్యాబోధనలో మెలకువలు నేర్చుకోని విద్యార్థులలో నైపుణ్యత పెంచాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... పిల్లలకు చదువుతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలని సూచించారు. నిరంతరం నేర్చుకునే ఉపాధ్యాయులు మాత్రమే చక్కటి విద్యార్థులను తయారు చేయగలరని అన్నారు. ఒత్తిడి లేని విద్యా విధానం రావాలని కోరారు. బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యూ ఎర కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, బాలోత్సవం కార్యదర్శి ఎన్.సోమయ్య, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షురాలు కె.సుజావతి, రూపా, రుక్మిణి, కందుకూరి రాము పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే ప్రజా సంక్షేమం



పార్థివాడలో ప్రచారం చేస్తున్న ముఠాజైసింహ

చిక్కడపల్లి: కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా గురువారం గాంధీనగర్ డివిజన్ పార్థివాడ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేశారని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. గడిచిన ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను ఏ విధంగా గెలిపించారో అదే విధంగా పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, గడ్డమీది శ్రీనివాస్, రవిశంకర్‌గుప్తా, రాజుకుమార్, హన్మంతు, నవీన్, దేవయ్య, శ్రీధర్ రెడ్డి, సుధాకర్, గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.



నాగమయ్యకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

ముషీరాబాద్: సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడిక్‌మెట్, భోలక్‌పూర్ డివిజన్‌లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంట, సాయిచరణ్ కాలనీ, దయానంద్ నగర్, భోలక్‌పూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగు నెలల్లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ముఠా జైసింహ ఎండగట్టారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ముఠా జైసింహ ధీమా వ్యక్తం చేశారు.

అంకితభావంతో చదివితే సివిల్స్ సాధించవచ్చు



సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు సూచనలిస్తున్న 50వ ర్యాంకర్ చందన జాహ్నవి



36వ ర్యాంకర్ అయుషిప్రాధాన్ సన్మానించిన సంస్థ ప్రతినిధి

చిక్కడపల్లి: పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చునని సివిల్స్ 36వ ర్యాంకర్ అయుషి ప్రాధాన్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుషి ప్రధాన్ మాట్లాడుతూ... సవాళ్లను ఎదుర్కొంటూ స్థిరత్వం సాహసంతో అడ్డంకులను అధిగమించి చదివితే ఫలితం ఆశించదగ్గదిగా ఉంటుందన్నారు. 50వ ర్యాంకర్ కె.ఎస్. చందనజాహ్నవి మాట్లాడుతూ... తన మొదటి ప్రయత్నంలో సీఎస్‌ఈ 2020 ఇండియన్ కార్పొరేట్ సర్వీస్‌లో చేరానని, రెండవ ప్రయత్నంలో సీఎస్‌ఈ 2023 ఆలిండియా ర్యాంక్ రెవెన్యూ సర్వీస్‌ను సాధించానన్నారు. అభ్యర్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ర్యాంకర్లను సన్మానించారు. విజన్ ప్రతినిధి, ఫ్యాకల్టీలు, సివిల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైలులో మహిళ పుస్తెల తాడు చోరీ

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు

కాచిగూడ: రైలులో ఓ మహిళ పుస్తెల తాడు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... కీసర ప్రాంతానికి చెందిన జ్యోతి (32) బుధవారం రాత్రి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో షిరిడీ నుంచి కాచిగూడకు వస్తుండగా మార్గమధ్యలో పూర్ణ జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని 2.5 తులాల పుస్తెలతాడును దొంగిలించారు. దీంతో గురువారం ఆమె కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నాందేడ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ముగిసిన ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి దంపతులు

అంబర్‌పేట: అంబర్‌పేట ప్రధాన రోడ్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం గురువారం ముగిసింది. కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి దంపతులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు ఏడాది జైలు శిక్ష

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగమయ్యకుంట నివాసిపై దాడి చేసిన కేసులో నిందితుడికి న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించింది. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సమాచారం మేరకు... నాగమయ్యకుంట నివాసి పి.సుదర్శన్‌పై అతని ఇంటిపక్కన నివసించే అనిల్ 2018 జూన్ 19న దాడి చేశాడు. అల్లరిచేసి బెదరించి బండరాయితో సుదర్శన్ తల పగులగొట్టాడు. బాధితుడు సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ పి.బాలరాజు కేసు నమోదు చేసి విచారణ అనంతరం నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన నాంపల్లి 9వ ఏసీఎంఎం జడ్జి ఉదయభాస్కర్ గురువారం నిందితుడు అనిల్‌కు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధించారు. అప్పటి కేసు అనంతరం అనిల్‌పై చిక్కడపల్లి పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నల్లకుంట: అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ ఎ.కృష్ణ సమాచారం మేరకు... బుధవారం రాత్రి అడిక్‌మెట్ ఫ్లై ఓవర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (35) పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది ఆ వ్యక్తిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే నల్లకుంట పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఐపీఎల్ టికెట్ల జారీలో కొరవడిన పారదర్శకత

హిమాయత్‌నగర్: ఐపీఎల్ టికెట్ల జారీలో పారదర్శకత లేకుండా వ్యవహరించిన హెచ్‌సీఏ బోర్డ్, సన్ రైజర్స్ ఫ్రాంచైజీ యాజమాన్యాల తీరు సిగ్గుచేటని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్), డీవైఎఫ్ఐ, ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతలు పేర్కొన్నారు. టికెట్లను బ్లాక్ దందాలో అమ్ముకుంటున్న హెచ్‌సీఏ, సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని చలో ఉప్పల్ స్టేడియంకు బయలుదేరిన యువజన సంఘ నేతలు హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ రోడ్డుపై గురువారం నల్ల జెండాలను చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ కొద్దిసేపు పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు హస్మి, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ తదితరులు మాట్లాడారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించండి

సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి



ముషీరాబాద్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీల నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి నమ్మించి మోసం చేశారని ఈ రెండు పార్టీలను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారంలో భాగంగా భోలక్‌పూర్, ముషీరాబాద్ డివిజన్లలోని వివిధ ప్రాంతాలలో కిషన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో అవినీతి, ఉగ్రవాదాన్ని అణచివేసిన నరేంద్రమోదీ మూడవసారి ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. దేశం కోసం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నరేంద్రమోదీకి అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. రామ దూత అయిన నరేంద్రమోదీ అయోధ్యలో రామ మందిరాన్ని నిర్మించి హిందువుల మనోభావాలను కాపాడారని అన్నారు. దేశాన్ని కాపాడేందుకు నరేంద్రమోదీని గెలిపించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున ఎంపీ నిధులు కేటాయించానన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నేతలు కేవలం ఓట్ల కోసం ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారని పార్లమెంట్ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల నేతలకు ఓటమి తప్పదన్నారు. బీజేపీ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.కె.శంకర్‌రావు, అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్, రవికుమార్, చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు జమాల్‌పురి నందు, విశ్వం సదానంద్, బిజ్జ కనకేష్‌కుమార్, నాయకులు అజయ్‌గుప్తా, వాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పద్య నాటకాలను భావితరాలకు అందించాలి



పద్యనాటకంలోని ఓ సన్నివేశం

చిక్కడపల్లి: పౌరాణిక పద్య నాటకాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని జవహర్ బాలభవన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.కె.రాము అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర నాటకరంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో కల్పన కళానికేతన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగాన సభలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీకృష్ణ రాయబారం, కర్ణసందేశం పాద్య నాటక దృశ్య ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగినే సభలో రాము మాట్లాడుతూ... పద్య నాటకాలను భావితరాలకు అందించాల్సి ఉందన్నారు. మాజీ జడ్జి బూర్గుల మధుసూదన్, వికీ డ్యాన్స్ మాస్టర్, శ్రీనివాస్‌రావు, గడ్డం లాలయ్య, నిర్వాహకుడు, నటుడు దొంతి జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

28న ‘నాట్య మహోత్సవం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

హిమాయత్‌నగర్: ప్రపంచ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, స్ఫూర్తి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ‘నాట్య మహోత్సవం -2024’ను నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టర్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, కూచిపూడి, భరతనాట్యం గురువు డాక్టర్ సురభి శారద, కేంద్ర సెన్సార్ ఫిలింబోర్డు సభ్యుడు కృష్ణాదిశేషు, నారాయణ మాస్టారు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కూచిపూడి, భరత నాట్యం, కథక్, పేరిణి తదితర శాస్త్రీయ నృత్యాలతో పాటు జానపద, దేశభక్తి, సినిమా, నాట్య కళాకారుల నాట్య ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నాట్య మహోత్సవంలో పాల్గొన్న ప్రతి నాట్య కళాకారులకు సర్టిఫికెట్, మెమొంటో ప్రదానం చేస్తామని నారాయణ మాస్టారు తెలిపారు. 6 నుంచి 60 ఏళ్లలోపు వారు మహోత్సవంలో పాల్గొని నాట్య ప్రదర్శన ఇవ్వొచ్చని తెలిపారు. నాట్య కళాకారులు సన్మానం పొందడానికి, నాట్య గురువులు ఈ నెల 27వ తేదీలోగా ఫోన్: 9652347207లో సంప్రదించి పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని వారు కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ విద్యార్థుల హవా



నారాయణ కళాశాల విద్యార్థులతో కళాశాల కోర్ డీన్ హబీబ్...

నల్లకుంట: జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో నారాయణగూడ డివిజన్ నల్లకుంట పరిధిలోని నారాయణ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. వై.కేతన్‌రెడ్డి 66వ ర్యాంకు, ఎస్.మణిదీప్‌కుమార్ 78వ ర్యాంకు సాధించారు. మరో నలుగురు విద్యార్థులు వేయిలోపు ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించింది. కార్యక్రమంలో కళాశాల కోర్ డీన్ హబీబ్, డీజీఎం లక్ష్మారెడ్డి, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏజీఎం మల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

ముషీరాబాద్: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దానం నాగేందర్ గెలుపు లాంఛనమేనని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, అంజన్‌కుమార్‌యాదవ్ తనయుడు ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్‌కు ఎక్కువ ఓట్లు పడే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ముస్లింలు, క్రిస్టియన్, మైనార్టీలు కాంగ్రెస్ పార్టీ పట్ల మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల చరిష్మా తమకు బాగా కలిసి వస్తుందని తెలిపారు. ఐదేళ్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ కార్యకర్తలే కిషన్‌రెడ్డిని ఓడించేందుకు కంకణం కట్టుకున్నారన్నారు.

సంప్రదాయ సంగీతాన్ని కాపాడుకోవాలి



డీవీ మోహనకృష్ణ, శోభారాజులను సన్మానిస్తున్న నరసింహప్ప

చిక్కడపల్లి: సంప్రదాయ సంగీతాన్ని కాపాడుకోవాలని ఆదాయ పన్ను శాఖ విశ్రాంత ఉన్నతాధికారి నరసింహప్ప అన్నారు. మోహనకృష్ణ, శోభారాజు శాస్త్రీయ సంగీతం, లలితసంగీత ప్రచారానికి తమవంతు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాగరాగిణి సంస్థ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయ గానసభలో ప్రముఖ గాయకులు డీవీ మోహన్‌కృష్ణ, శోభారాజులకు ఆత్మీయ సత్కారం చేశారు. నరసంహప్ప మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ కళాకారులు కాలేరని అన్నారు. ప్రముఖ గాయకురాలు హైమవతి బీమన్న అధ్యక్షత వహించిన సభలో ముదిగొండ శివప్రసాద్, సత్యప్రసాద్, శైలజ, సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణకుమారి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. తొలుత అన్నమయ్య కీర్తనలు మధురంగా ఆలపించారు.

ఘనంగా సెయింట్ మేరీస్ గ్రాడ్యుయేషన్ డే



నల్లకుంట: న్యూనల్లకుంట లింగాలగడ్డ శివాలయం సమీపంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో గురువారం గ్యాడ్యుయేషన్ డే చిన్నారుల సంబురాల మధ్య ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ వై.వెంకట్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మితో కలిసి పాఠశాల ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పట్టాలు అందజేసి మాట్లాడారు. చిన్నారులు పట్టాలు పుచ్చుకుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ఫోటోలు దిగి ఆనందంలో మునిగితేలారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి స్వరూప, ఉపాధ్యాయులు సునంద, గౌతమి, తబసం తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, ఎక్స్‌పైరీ పాస్‌పోర్టులు కొరియర్ చేస్తున్నారంటూ భారీ మోసం

రిటైర్డ్ ఉద్యోగికి స్కైప్ కాల్ చేసి రూ. 49 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: ఫెడెక్స్ కొరియర్ ద్వారా డ్రగ్స్‌తో పాటు ఎక్స్‌పైరీ అయిన పాస్‌పోర్టులు పార్సిల్ చేస్తున్నారంటూ ఓ రిటైర్డ్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల వివరాల ప్రకారం నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి ముంబై ఫెడెక్స్ కొరియర్ పేరుతో సైబర్ నేరగాళ్లు కాల్ చేశారు. బాధితుడి ఆధార్ కార్డ్, మొబైల్ నంబర్‌కు లింక్ తో ఒక పార్శిల్‌లో 10 ఎల్ఎస్‌డి డ్రగ్స్ స్ట్రిప్స్ ఉన్నాయని, వాటితో పాటు గడువు ముగిసిన ఏడు పాస్‌పోర్టులు, ఏడు క్రెడిట్ కార్డులు, 7 కిలోల బట్టలు, ఉన్నాయని చెప్పారు. అనంతరం ముంబైకి చెందిన సైబర్ క్రై మ్ పోలీస్ అధికారి పేరుతో బాధితుడికి స్కైప్ వీడియో కాల్ చేశారు. తన ఆధార్ కార్డు వివరాలను ఉపయోగించి 20 బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. వాటిని వెంటనే మూసివేయాలని లేనిపక్షంలో అరెస్ట్ చేస్తామని బెదిరించారు. నిబంధనల ప్రకారం తన అన్ని బ్యాంక్ అకౌంట్లను వెరిఫై చేయాలని నమ్మించి తాము చెప్పిన ఐసిఐసిఐ బ్యాంక్ ఖాతాకు తన అకౌంట్లలో ఉన్న మొత్తం నగదును బదిలీ చేయాలన్నారు. నమ్మిన బాధితుడు తన హెచ్‌డిఎఫ్‌సి, ఎస్‌బిఐ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న మొత్తం రూ. 49,35,134 బదిలీ చేశాడు. అనంతరం వారు స్పందించకపోవడంతో మోసపోయానని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

వంట విషయంలో వివాదం: వివాహిత అదృశ్యం



భాగ్యమ్మ

నల్లకుంట: వంట విషయంలో భర్త మందలించడంతో మనస్థాపానికి గురైన ఓ ఇల్లాలు అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ ఎ.కృష్ణ సమాచారం మేరకు... ప్రైవేట్ డ్రైవర్ ఉద్యోగం చేస్తున్న గండకోటి కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్‌లో ఉంటున్నాడు. అతని భార్య కటిక భాగ్యమ్మ(46) స్థానికంగా ఇళ్లల్లో పనిచేస్తుంది. ఈ నెల 19న ఇంట్లో వంట చేసే విషయంలో భాగ్యమ్మను భర్త మందలించాడు. అనంతరం కోటి విధి నిర్వహణలో భాగంగా కరీంనగర్ వెళ్లి మరునాడు తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్య భాగ్యమ్మ ఇంట్లో కనిపించలేదు. ఆమె సెల్ నంబర్‌కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఆందోళన చెందిన కోటి తన భార్య కనిపించడం లేదంటూ గురువారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.